ఘనంగా చేనేత కార్మిక దినోత్సవం







ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## సమన్వయంతో పనిచేస్తూ ఫలితాలు సాధించాలి

**అక్షరటుడే, ఇందూరు:** అధ్యాపకులు సమన్వయంతో పనిచేస్తూ మంచి ఫలితాలను సాధించాలని రాష్ట్ర ఇంటర్ బోర్డు జిల్లా ప్రత్యేకాధికారి దాసరి ఒడ్డెన్న ఆదేశించారు. నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో చేరిన విద్యార్థుల అభ్యున్నతికి అన్ని సబ్జెక్టుల అధ్యాపకులు కృషి చేయాలన్నారు. కళాశాల ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నందున యూనిట్ టెస్టులను నిర్వహించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి శ్రద్ధ వహించాలన్నారు. ఇంటర్ బోర్డు సూచించిన టైం టేబుల్ ప్రకారం తరగతులు నిర్వహించాలన్నారు. ఆయన వెంట డీఐఈవో రవికుమార్, ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ ఉన్నారు.





# దంచికొట్టిన వాన..

ఖానాపూర్ రోడ్డులో..



గౌతంనగర్‌లో ఇళ్ల మధ్య రోడ్డుపై చేరిన వరద నీరు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అనేక చోట్ల వర్షం దంచికొట్టింది. గురువారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు, పలుచోట్ల రోడ్లు జలమయమయ్యాయి. నిజామాబాద్ నగరంలోని సీతారాంనగర్, జన్మభూమి రోడ్డు, అరుంధతి నగర్, గౌతంనగర్, ఖానాపూర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కాలనీలో ఇళ్లలోకి నీరు చేరాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షా ల నేపథ్యంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షా ల నేపథ్యంలో శ్రీరాంసాగర్ పరీవాహక ప్రాంతంతో పాటు నదులు, వాగులు పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. చేపల వేట, ఈత సరదా కోసం చెరువులు, కాలువలు, కుంటలు జలాశయాల వద్దకు వెళ్లొద్దని సూచించారు. భారీ వర్షా ల వల్ల ఎక్కడైనా ప్రమాదం ఎదురైనా.. అత్యవసర పరిస్థితులు ఏర్పడినా కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ కు 08462 – 2201832 ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. - అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



## సబ్ కలెక్టర్‌ను కలిసిన భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్



**అక్షరటుడే, భీమ్‌గల్:** ఆర్మూర్ సబ్ కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అభిగ్యాన్ మాల్వియాను మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## గల్ఫ్ కార్మికుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లండి

**అక్షరటుడే, కామారెడ్డి:** గల్ఫ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని గల్ఫ్ కార్మికుల సంక్షేమం సంఘం రామారెడ్డి మండల అధ్యక్షుడు బండ సురేందర్ రెడ్డి కోరారు. ఈ మేరకు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డిని కలిసి విన్నవించారు. క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యేను కలిసి పలు విషయాలపై చర్చించారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వాళ్లే ఎక్కువగా వెళ్తుంటారని, అక్కడ వారు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని వివరించారు. చనిపోయిన గల్ఫ్ కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఆర్థిక సహాయం అందేలా చూడాలన్నారు. అలాగే రెడ్డిపేట గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు.



# పేకాటలో పోకర్ చిప్స్..

పేకాట రాయుళ్లు పోలీసులకు చిక్కకుండా రోజుకో ఎత్తుగడ వేస్తున్నారు. సినిమా తరహాలో వాహనాలు మారుస్తూ అటవీ ప్రాంతాల్లోనూ జూదం అడ్డాలుగా మార్చుకుంటున్నారు. అంతేకాదు పోలీసులు రైడ్ చేస్తే నగదు పట్టుబడకుండా నయా ట్రెండ్‌కు తెర లేపారు. కాసినో కాయిన్స్ తరహా పోకర్ చిప్స్‌తో గేమ్ ఆడుతున్నారు. ఇలా జిల్లాలో పేకాట దందా మూడు పూలు ఆరు కాయలుగా సాగుతోంది.

- అక్షరటుడే, ఇందూరు

▸ పోలీసులకు చిక్కకుండా ఎత్తుగడ ▸ అటవీ ప్రాంతాల్లో జోరుగా సాగుతున్న జూదం

జిల్లాలోని వర్ని మండల అటవీ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా జోరుగా జూదం సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు వర్ని నుంచి బాన్సువాడ వెళ్లేదారిలో ఓ స్థావరాన్ని ఎంచుకున్నట్లు సమాచారం. బోధన్, నిజామాబాద్, బాన్సువాడ తదితర ప్రాంతాలకు చెందిన పలువురు వ్యాపారులు, ప్రముఖులు, రియల్టర్లు, లీడర్లు రూ. లక్షల్లో పేకాడుతున్నట్లు తెలుస్తోంది. మరీ ముఖ్యంగా కాసినో కాయిన్స్ మాదిరిగా ముద్రించిన పోకర్ చిప్స్‌ను రూపాయల మాదిరిగా జూదంలో వాడుతున్నారు.

### సినిమాల్లో మాదిరిగా వాహనాల మార్పు..

ఇక పేకాట స్థావరాలు సైతం పకడ్బందీగా ఏర్పాటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎవరి కంటా చిక్కకుండా కొందరు నిర్వాహకులు దట్టమైన అటవీ ప్రాంతాల్లో అడ్డాలు ఏర్పాటు చేసి జూదం ఆడిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ అటవీ ప్రాంతానికి వెళ్లాలంటే సాహసమే చేయాల్సి ఉంటుందట. పేకాట ఆడాలనుకునేవారు వర్నికి చేరుకుంటే నిర్వాహకులే అంతా చూసుకుంటారు. వారి వాహనాల్లో అటవీ ప్రాంతానికి తరలిస్తారు. మధ్యలో మరో వాహనంలోకి మారుస్తారు. అక్కడి నుంచి అడ్డాకు చేరుస్తారు. నిర్వాహకుల్లో ఒకరిని మాస్, మరొకరిని మిర్చి అంటూ కోడ్ భాషలో పిలుస్తారని సమాచారం.

### అంతా కాయిన్స్ రూపంలో..

జూదం ఆడే సమయంలో ఒకవేళ పోలీసులకు పట్టుపడితే నగదు లభించకుండా జాగ్రత్త పడుతున్నారు. కాసినో కాయిన్స్ తరహాలో పోకర్ చిప్స్ ముద్రించి, ఒక్కో కాయిన్‌కు ఒక్కో విలువను పెట్టుకున్నారు. ఇలా నిత్యం లక్షల్లో జూదం కొనసాగుతున్నట్లు సమాచారం. జిల్లాలో నయా ట్రెండ్‌లో ఇంత పెద్ద ఎత్తున దందా సాగుతుండడంపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.





## డొంకేశ్వర్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**అక్షరటుడే, ఆర్మూర్ :** ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. సాధారణ చికిత్సలతో పాటు గర్భిణులకు స్థానికంగానే ప్రసవాలు కూడా చేయాలన్నారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలో కలెక్టర్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, సహకార సంఘం ఎరువుల గోడౌన్, ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించారు. ముందుగా పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్.. ఓపీ రిజిస్టర్, సిబ్బంది హాజరును పరిశీలించారు. పీహెచ్‌సీతో పాటు దీని పరిధిలోని ఆరు హెల్త్ సబ్ సెంటర్ల ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



## ఆరోగ్య కేంద్రం వద్ద పెట్రోలింగ్ నిర్వహించాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం వద్ద రాత్రివేళల్లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పోలీసులను ఆదేశించారు. గర్గుల్ శివారులోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలో ఆకతాయిలు రాత్రివేళల్లో తిష్ట వేస్తున్నారనే ఫిర్యాదులు వచ్చినందున.. పెట్రోలింగ్ చేయాలని పోలీసులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని మౌలిక వసతులను, రోగులకు అందుతున్న సేవలను గురించి ఆరా తీశారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్, మండల వైద్యాధికారి జోహార్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా అంతా డ్రామా..: దినేష్ కులాచారి

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో చేపట్టిన ధర్నా అంతా డ్రామా అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు అన్యాయం చేసిన కాంగ్రెస్ నేతలే ధర్నా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే 42 శాతం రిజర్వేషన్ల నుంచి ముస్లింలను తొలగించాలని డిమాండ్ చేశారు. వారిని తొలగిస్తే కేంద్రం నుంచి అమలు చేసే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. బీసీలకు కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేస్తుందని, ఇది బీసీల ఉనికికే ప్రమాదమన్నారు. రాష్ట్ర సీఎం ధర్నా చేస్తే అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ఖర్గే మద్దతు తెలపకపోవడంతోనే.. బీసీలపై ప్రేమ ఎంత ఉందో అర్థమవుతుందన్నారు. దొంగ దారిలో ముస్లింలకు రిజర్వేషన్లు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారని ఆరోపించారు. ముస్లింల మీద ప్రేమ ఉంటే కేంద్రం అమలు చేస్తున్న ఈడబ్ల్యూఎస్‌ను రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. ధర్నా అసలైన ఉద్దేశం బీసీల మీద ప్రేమ కాదని, ముస్లిం రిజర్వేషన్ కోసం అని విమర్శించారు. అందుకే ఢిల్లీ ధర్నాలో బీసీలు మద్దతు తెలపలేరని గుర్తు



చేశారు. తెలంగాణలో హిందువులను మైనార్టీలుగా చేయాలని కుట్ర జరుగుతుందని చెప్పారు. కావున స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ఒక్క బీసీని కూడా సీఎం చేయలేదని దినేష్ కులాచారి అన్నారు. జిల్లాలోనూ కార్పొరేషన్ ఛైర్మన్ బీసీలు లేరన్నారు. భవిష్యత్తులో యూపీ, బెంగాల్ తరహాలో రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ఉనికి కోల్పోతుందన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు లక్ష్మీ నారాయణ, కొండా ఆశన్న, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## హెడ్‌పోస్టాఫీస్‌లో మహిళల మధ్య ఘర్షణ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మహాలక్ష్మి పథకం కింద డబ్బులు ఇస్తున్నారనే పుకార్లతో పలువురు మహిళలు నగరంలోని హెడ్‌పోస్టాఫీస్ వద్ద బారులు తీరారు. అది కూడా ఇండియన్ పోస్టల్ బ్యాంక్‌లో ఖాతా ఉన్నవారికే డబ్బులు వస్తాయని పుకార్లు రావడంతో వారంతా పోస్టాఫీస్ ఎదుట క్యూ కట్టారు. ఈ క్రమంలో పలువురు మహిళలు ఘర్షణకు దిగారు. ఒకరినొకరు కొట్టుకున్నారు. అలాంటి పథకమేదీ లేదంటూ పోస్టల్ అధికారులు చెబుతున్నా మహిళలు రోజూ పోస్టాఫీస్ ఎదుట క్యూ కడుతున్నారు.





## నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లో రంగు మారిన నీళ్లు

నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోని నీళ్లు రంగుమారాయి. ప్రాజెక్ట్‌లోని నీళ్లు ఇలా రంగు మారడంతో పర్యాటకులు ఒకింత ఆశ్చర్యపోతున్నారు. ప్రాజెక్ట్ ఎగువప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో లేకపోవడంతో నిల్వ ఉన్న నీళ్లు ఆకుపచ్చ వర్ణంలో కనిపిస్తున్నాయి. వర్షా కాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. వర్షా ల జాడ లేకపోవడంతో ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 1405 అడుగులకు ( 17.80 టీఎంసీలు) గాను 1391.06 అడుగుల (4.50 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. వెయ్యి క్యూసెక్కుల నీటిని ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టుకు విడుదల చేస్తున్నారు. - అక్షరటుడే, నిజాంసాగర్



## జాతీయ ఓబీసీ మహాసభలో పాల్గొన్న జిల్లా బీసీ నాయకులు

**అక్షరటుడే, ఇందూరు:** మండల్ డే సందర్భంగా గోవాలో గురువారం నిర్వహిస్తున్న జాతీయ ఓబీసీ మహాసభలకు జిల్లా నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై గళం విప్పాల్సిన సమయం ఇదే అన్నారు. కేంద్రం వెంటనే కుల గణన ప్రారంభించాలని, తెలంగాణ ప్రభుత్వం బీసీలకు కల్పిస్తున్న 42 శాతం రిజర్వేషన్ల ఆర్డినెన్స్ ఆమోదించాలని డిమాండ్ చేశారు. గోవాకు వెళ్లిన వారిలో జిల్లా నాయకులు ప్రసాద్, వినోద్, నారాయణరెడ్డి, దేవేందర్, శంకర్, శ్రీలత, చంద్రకాంత్, రాజు, అన్నయ్య, స్వామి, మహేష్, నర్సయ్య తదితరులున్నారు.



## అల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు విధిగా వేయాలి

**అక్షరటుడే, భీమ్‌గల్ :** జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 11న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను విధిగా వేయించాలని కిషన్ నగర్ మెడికల్ ఆఫీసర్ స్రవంతి, ఎంఈవో బట్టు రాజేశ్వర్ సూచించారు. ఆయా పాఠశాలల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, 2 - 19 ఏళ్ల లోపు విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, నోడల్ అధికారులు, హెచ్ఈవో వేణుగోపాల్, సీఆర్పీలు ప్రభాకర్, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమైనవి




**అక్షరటుడే, డిచ్‌పల్లి:** తల్లి పాలే బిడ్డకు శ్రేష్టమైనవని మహిళా కమిషన్ సభ్యురాలు సుదాం లక్ష్మి అన్నారు. మండలకేంద్రంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని సూచించారు. దీంతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం డీడబ్ల్యూవో రసూల్ బీ మాట్లాడుతూ.. పసి పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు సులభంగా జీర్ణమవుతాయన్నారు. కార్యక్రమంలో సీడీపీవో జ్యోతి, డాక్టర్ దీపక్ రాథోడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరం

**అక్షరటుడే, నిజాంసాగర్:** తల్లిపాలు పుట్టిన బిడ్డకు ఎంతో ఆరోగ్యకరమని వైద్యశాఖ సూపర్‌వైజర్ ఎలిజబెత్ అన్నారు. మండల కేంద్రంలోని బంజేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ప్రతి తల్లి తమ బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఎంతో శ్రేష్టమైనవన్నారు. పిల్లలు తల్లి పాలు తాగడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ కార్యకర్త ఫర్హానా, అంగన్‌వాడీ కార్యకర్త అనిత, పంచాయతీ కార్యదర్శి భీమ్‌రావు, కారోబార్ సాయిలు, ఆశా కార్యకర్త పార్వతి తదితరులు పాల్గొన్నారు.




సీతారాంనగర్ కాలనీలో..

# దంచికొట్టిన వాన..


అరుంధతి నగర్‌లో..


నగరంలోని డీపీవో కార్యాలయంలో..


దుబ్బ జన్మభూమి రోడ్డులో..

## పట్టణ గాండ్ల సంఘం ఏకగ్రీవ ఎన్నిక



**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ :** నిజామాబాద్ పట్టణ గాండ్ల సంఘం కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భాసోలా నాగరాజు, ఉపాధ్యక్షులుగా అసోల్లా రాజేంద్ర, కూతురు గోపి, కార్యదర్శిగా కాసొల్లా మోహన్, సంయుక్త కార్యదర్శిగా సాయన్న, కోశాధికారిగా హన్మాండ్లు ఎన్నికయ్యారు.

## రవాణా సౌకర్యం కల్పించాలని టీచర్ల ఆందోళన



**అక్షరటుడే, బోధన్:** పట్టణ శివారులోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల మహిళా ఉపాధ్యాయులు గురువారం స్కూల్ ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. పట్టణానికి దూరంగా 3 కి.మీ. దూరంలో మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మించారని.. దీంతో తమకు రవాణా సౌకర్యం లేక నిత్యం అవస్థలు పడుతున్నామన్నారు. ప్రతిరోజు 3 కి.మీ. నడుచుకుంటూ వెళ్లిరావడం ఇబ్బందిగా మారిందన్నారు. సొంత బైక్‌లపై వెళ్తే.. కుక్కలు వెంటపడి భయపెడుతున్నాయని.. పాఠశాల నుంచి తమకు రవాణా సౌకర్యం కల్పించాలని వారు కోరారు.

## సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. మాక్లూర్ మండలం కృష్ణానగర్ తండాలోని రామ మందిరంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాక్లూర్ మండల బీజేపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో వైద్య పరీక్షలు



**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు గురువారం మండల వైద్యాధికారిని రాంబాయి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె 542 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి 100 మందికి మందులను పంపిణీ చేశామని తెలిపారు. 8 మంది విద్యార్థులకు చర్మ సంబంధిత వ్యాధులను గుర్తించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రాజమణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



నగరంలో చేనేత కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



పిట్లం మండల కేంద్రంలో..


### ఘనంగా జాతీయ చేనేత కార్మిక దినోత్సవం

**ఉమ్మడిజిల్లాలో జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత రంగం ప్రధాన భూమిక పోషించిందన్నారు. కాని నేడు చేనేత రంగం దీనావస్థలో ఉందని వారు పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు వ్యాఖ్యానించారు.** – అక్షరటుడే, నెట్‌వర్క్


నగరంలోని చేనేత కార్మిక సంఘు భవనంలో..

## ప్రొటోకాల్ పాటించడంలేదని ఫిర్యాదు

**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వడ్డీ రాయితీ రుణాల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం తహశీల్దార్ షబ్బీర్, ఎంపీడీవో సంతోష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారులు అధికార పార్టీకి చెందిన నాయకులను ఆహ్వానించి వారితో కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్నారన్నారు. దినపత్రికల్లో వచ్చిన కథనాల ఆధారాలను ఫిర్యాదుతో జత చేశామన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఆరే రవీందర్ మాట్లాడుతూ.. రాజకీయ నాయకులను అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించి ప్రొటోకాల్ విస్మరిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఐకేపీ అధికారుల తీరుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తోట గంగాధర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ యోగేశ్వర నర్సయ్య, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండారి లక్ష్మణ్ గౌడ్, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు రమావత్ వెంకటేష్, శక్తి కేంద్ర ప్రముఖ్ హరిప్రసాద్, లక్ష్మీ నారాయణ, బీజేవైఎం నాయకులు శెట్టి ప్రేమ్ చంద్, పాల్గొన్నారు.




## సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 19 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లాలో సీపీఐ రాష్ట్ర నాల్గో మహాసభలు జరగనున్నాయన్నారు. మహాసభల్లో మూడేళ్లలో పార్టీగా చేసిన ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్తు మూడేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి ఉద్యమాలను రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఓమయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పి.హన్మాండ్లు, అలీ ఇమ్రాన్, సక్కి, సురేష్, పరుశురాం పాల్గొన్నారు.



## శిశు మందిర్‌లో రక్షాబంధన్

**అక్షరటుడే, నిజాంసాగర్:** పిట్లం మండలకేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో గురువారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు విద్యార్థులకు రాఖీలు కట్టి సోదర భావం చాటుకున్నారు. అలాగే రక్షా బంధన్ కార్యక్రమం ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు.

### భీమ్‌గల్‌లో..



**అక్షరటుడే,భీమ్‌గల్:** బాల్కొండ మండల కేంద్రంలోని మదర్ థెరిస్సా, వెంకటేశ్వర ఉన్నత పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అన్నాచెల్లెళ్ల అనురాగానికి, ఆప్యాయతకు రాఖీ పౌర్ణమి చిహ్నంగా నిలుస్తుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థినులు తమ తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కె.రామలక్ష్మి, సుబ్బారెడ్డి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్ మాటలన్నీ ఉత్తవే..



**అక్షరటుడే, లింగంపేట:** కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్ ఇస్తున్నామంటూ నాటకాలు ఆడుతోందని బీజేపీ లింగంపేట మండలాధ్యక్షుడు బొల్లారం క్రాంతికుమార్ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో గురువా రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో 22 నెలల నుంచి సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు లేకుండా పాలన చేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహిస్తే ఓడిపోతామనే ఉద్దేశంతో బీసీలను రిజర్వేషన్ పేరిట మోసపూరితమైన మాటలు మాట్లాడుతోందని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు అంద్యాల ఉదయ్, ప్రధాన కార్యదర్శి ఆకుల విష్ణువర్ధన్, మండల ఉపాధ్యక్షుడు కోల అల్లూరి, బూత్ అధ్యక్షుడు తల్వార్ సాయిలు, బొల్లు గణేష్, చిరంజీవి, మహేష్, అశోక్, రవి, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.